


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

"**ఆ వూరు వెళ్ళే** బాటలన్నీ వర్షానికి తెగిపోయాయి. చెట్లు విరిగి రోడ్లమీద పడటం వల్ల రాకపోకలు స్థంభించిపోయాయి. ప్రభుత్వం నిమ్మకి నీరెత్తినట్లు కూర్చుంది కానీ, రోడ్లు బాగుచెయ్యడం, ఛిన్నాభిన్నమైన గుడిసెల్లోనూ పాకల్లోనూ ఉండే అభాగ్యుల్ని ఆదరించేపని కానీ ఆపన్న హస్తాన్నందించేపని కానీ చేయట్లేదు. అయ్యా ఈ ప్రాంతపు జనాలందరూ ధనికులు కారు. తిండికీ, బట్టకీ లోటు లేకుండా జీవితాన్ని జరుపుకుంటున్నారు. పోనీ వాళ్ళయినా నడుం బిగించి 'గ్రామసేవ' చేస్తారా అంటే అదీ సందేహమే. కిందపడ్డవాడ్ని లేచి పనిచేసుకోమంటే? మామూలుగా కిందపడితే ఎలాగొలా లేపొచ్చు. కాళ్ళు విరిగినవాడ్ని పైకి లేపి పనిచేయించగలమా?" సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు ఓ దానయ్యగారు. 'మట్టు' ఓపిగ్గా వింటున్నాడు.

"దాందుంపతెగ.. నిద్రపోతున్న సింహం తటాల్న వొళ్ళు విరుచుకుని గర్జించినట్లు ఆ ఉరుములేమిటో! ఇద్దరు, కాదు కాదు వెయ్యిమంది మహావీరులు కత్తి యుద్ధం చేస్తుంటే, ఆ యుద్ధంలో కరవాలాలు మెరిసినట్లు ఖణేల్ ఖణేల్ మనే ఆ మెరుపులేమిటో, కొండలు పేలిపోయి రాళ్ళూ రాళ్ళూ ఢీ కొట్టుకున్నట్టు ఆ పిడుగులేమిటో, అయ్యా నిన్నటి రాత్రి భీభత్సాన్ని వర్ణించడానికి నేనేమన్నా కాళిదాసునా? కవీశ్వరుడినా? ఒకటి మాత్రం నిజం.. పిడుగులు పైనించి కిందకు

పడ్డాయో, కిందనించి నింగిలోకి భయంకరమైన శబ్దంతో దూసుకుపోయాయో మాత్రం అర్ధంకాలేదండీ. అప్పటికీ మాఆవిడ అంది, 'ఇది కలియుగాంతపు సంకేతం', అని. నాబోటిగాళ్ళకి పెళ్ళాం మాటైనా భగవంతుడి ఆజ్ఞ అయినా ఒకటేగదండీ!" నవ్వుతూ అన్నాడు దానయ్య.

"తక్షపురం ఎంతదూరం?" తెలీనట్టు అడిగాడు మట్టూ.

"ఎందుకుండదూ? పదిమైళ్ళు యీజీగా వుంటుంది బాగా నడిస్తే. ఇప్పుడైతే ఇరవై మైళ్ళుంటుంది. నడక సాగదు గనక!" చిద్విలాసంగా అన్నాడు దానయ్య.

"ఆ వూరి విశేషాలేమైనా తెలిశాయా? మా దూరపు బంధువులు ఉన్నారు" మొహం కొంచెం దీనంగా పెట్టి అన్నాడు మట్టూ.

"అయ్యా, ఆ ఊరే ఈ మధ్య ఓ విశేషాల పుట్టగా తయారైంది.ఆ పాముల గుడికి తెగ ప్రచారం వచ్చింది. ఎవతో ముసల్ది శాపనార్ధాలు పెడుతూ ప్రజల్ని భయపెట్టిందట. ఆడవాళ్ళు రాతి వెన్నెల్లో ముగ్గులు వేసి తెల్లారు ఝామున చూస్తే ఆ ముగ్గులనిండా పాములు పాకిన గుర్తులున్నాయట. తొందర్లోనే ఆ పెద్ద పాము శిలారూపం వొదిలేసి జనాల్ని బజ్జీలు మింగినట్టు మింగేస్తుందట. బాబూ, ఎవరెవరో వస్తున్నారట. ఎవరేమిటో ఎవరికీ తెలీని ఊరోళ్ళు మల్ల గుల్లాలు పడుతున్నారుట" ఆగి చుట్ట ముట్టించాడు దానయ్య. తల పంకించాడు మట్టూ.

ఆ వూరి పేరు ఎర్రగుంట్ల. ఆ వూరూ ప్రకృతి విలయానికి భీభత్సంగా మారింది. జనాలు రోడ్లమీదే ఉన్నారు. ఎగిరిపోయిన తాటాకులు సీనారేకులు ఎక్కడ బడితే అక్కడ ఉన్నాయి. కొన్నయితే  పై కప్పులు లేక కేవలం గోడలు మాత్రమే ఉన్న గుడిసెలు పాకలు. వాటిల్లో బిగ్గటిల్లి ఏడుస్తూన్న పిల్లలు. వర్షానికి తడిసిపోయిన కట్టెలూ, కుండల్లో నిండుకున్న ఆహారం. పిల్లల ఆకలి తీర్చేదెలా? దీనంగా ఉన్నారు ప్రజలు.

"వస్తాను అయ్యా" అంటూ లేచాడు మట్టూ.

"ఆ ఊరెళ్తావా? వొద్దు. మధ్యలో మాంచాలమ్మ చెరువుంది. గట్టు తెగిపోయినా, దానిలోతు ఏభై తాళ్ళకి పై మాటే. (పల్లెటూళ్ళలో 'తాళ్ళ' కొలతలతో చెరువుల లోతుల్ని అంచనా వేస్తారు .'తాడు' అంటే ఎదిగిన 'తాడిచెట్ట'న్నమాట. 50 తాళ్ళు అంటే50 తాడిచెట్లు లోతు ఉంటందని అర్ధం}

"గట్టు తెగిందా?" అడిగాడు మట్టూ.

"ఎందుకు తెగదూ? రాత్రి కురిసింది వర్షంకాదు నాయనా కుండపోత, దాన్నే అంటారేమో 'కుంభవృష్టి' అని. దానికి తోడు వడగళ్ళు. ఎంతెంతవనుకున్నావూ? పొద్దున దాకా అవి కరుగుతూనే ఉన్నై. ఇంత బరువు చెరువు ఎట్టా మొయ్యగలదూ? ఎప్పుడో గట్టుని కొట్టేసుంటుంది ఓ పీల్పు పీల్చి జవాబిచ్చాడు దానయ్య.

లావాటి చుట్ట ఎర్రంగా మెరవడం చూసి తననీ, శృంగినీ దారిలో ఆపిన పాము కళ్ళు గుర్తుకొచ్చాయి.

ఏదేమైనా వెళ్ళక తప్పదనుకున్నాడు మట్టూ. అదే ఆలస్యం చెయ్యకూడదు. పరిసరాలు గమనించాలంటే, ఊరు స్వస్థపడ్డాక కాదు. అస్తవ్యస్థంగా ఉన్నప్పుడే గమనించాలి. ఎవరో పలకరించడంలో దానయ్య లేచాడు. అతను ముందుకెళ్ళాక మట్టూ 'తక్షపురం' వైపుకి అడుగులు వేశాడు.

మట్టూకి పదిమైళ్ళ దూరం ఓ లెక్క కాదు. ఎటొచ్చీ సమస్య మాంచాలమ్మ చెరువే. అది గండి పడితే? గట్టు కొట్టుకుపోతే. అది చాలా చాలా పెద్ద చెరువు. గట్టు వుంటే ఏ దిశగా యీదొచ్చో తెలుస్తుంది. అది కొట్టుకుపోతే?

దారిలో ఓ ఈ ఈతల తోపు కనిపించింది. బొడ్డు దగ్గరున్న కత్తిని తీసి ఓ ఈత మొక్క ఆకులు తీసేసి బొత్తనించి గుంజుని తీశాడు. తియ్యగా సుఖంగా ఉంది తింటుంటే. కొన్ని యీత చెట్లకు కల్లుముంతలు వేలాడుతున్నాయి. అన్నీ పగిలిపోయినవే. కొన్ని యీతచెట్లు విరిగిపోయాయి. తిన్నాక నడక వేగం పెంచాడు. సాయంత్రం చీకటి పడేలోపున అక్కడికి చేరి తీరాలి. మొదట చూడాల్సింది తక్షకేశ్వరాలయం. ఆ తరువాత ఊరి ఊరినంతా చుట్టి చూసి ఏ ఏ విద్ధూరాలు జరిగాయో విచారించాలి. అతనికి తెలుసు.. మనుషులు చెప్పే మాటల్లో అర్ధంకన్నా అతిశయోక్తులు ఎక్కువుంటాయని. రోడ్డు కాని రోడ్డుమీద నడుస్తూ ఆలోచిస్తున్నాడు మట్టూ. జరిగింది దారుణమే. ప్రకృతి పగబట్టినట్టుగా విరుచుకుపడింది. కొన్ని పశువుల మృతదేహాల్ని కాకులు పొడుస్తున్నాయి. రాబందులు మానవుడి కంటికే కనబడటంలేదుగా! ఆవులూ దూడలు మేకలూ గొర్రెలూ ఎట్లా గొడ్ల పాకల్నించి తప్పించుకు వచ్చాయో తెలీదు. కానీ మృత్యువాతబడ్డాయి. వడగళ్ళ దెబ్బకా? వడగళ్ళు అంత పెద్దగా పడతాయా? పడినా అవి పశువుల్ని చంపే పరిమాణంలో ఉంటాయా? నడుస్తూనే ఉన్నాడు. దూరంగా మాంచాలమ్మ చెరువు కనబడింది.

సముద్రమా అనుకున్నాడు ఓ క్షణం. అంత పెద్ద చెరువుని అతను చూడలేదు. ధారలుగా కురిసిన వర్షాన్నంతా తనలో ఇముడ్చుకుని వామనుడు విశ్వాన్ని ఆక్రమించినట్టు కనుచూపు మేరనున్న భూమినంతా ఆక్రమించింది.

అక్కడక్కడా మామిడిచెట్ల తలలు, తాడిచెట్ల తలలు మాత్రం కనిపిస్తున్నాయి. అంటే పంటపొలాలు అన్నిట్నీ మాంచాలమ్మ తన గర్భంలోనే దాచుకుందన్నమాట.

సన్నటి కట్లపాములా ఓ వైపు గట్టు కనబడింది. గట్టుకు అటు ఇటు నీరు జరగాలి. మధ్యలో సన్నగా గట్టు. ఆ గట్టు చాలా ఎత్తైనది అయివుండాలి. ఈ చివరినించి కనిపిస్తోంది. కానీ, ఆ చివరివరకూ అది ఉందా? అసలు మధ్యలో అయినా గట్టు సరిగ్గా ఉందా? నడిస్తేగానీ తెలీదు. గట్టు ఉండటం ఒక వరమే. కనీసం ఎటు వెళ్ళాలో తెలుస్తుంది. చాలాసేపటికిగానీ గట్టు మొదటికి చేరుకోలేకపోయాడు మట్టూ. చెరువు ఆవలి పక్కకి చేరడం సాధ్యమా? ఖచ్చితంగా మధ్య మధ్యలో ఈదాల్సిరావొచ్చు. ఈదగలనా? అనుకున్నాడు మట్టూ.

"తక్షేశ్వరా, నిన్ను చూడాలని వస్తున్నాను. ఆపైన నీ దయ. ప్రేమైనా, పగ అయినా నీవు యీశ్వరుడివేగా. నీ ఆటలో నేనో బొమ్మని. నా ప్రాణం నీ చేతిలోనే పెడుతున్నాను" అవి మాంచాలమ్మ చెరువుకీ, గట్టుకీ, తన తల్లిదండ్రులకీ నమస్కరించి గట్టుమీద కాలు పెట్టాడు మట్టూ.

"అకాల వర్షాలు. ఊహించని విధంగా రాజస్థాన్, హర్యానా ఢిల్లీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రాల్లో భయంకరమైన వానలు, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. జన, పశు ప్రాణాలకి అపారనష్టం జరిగింది. మృతుల సంఖ్య లక్షలలోనే. ట్రాక్‌లమీదుగా నీరు ప్రవహించడంతో చాలా చోట్ల రైల్వే పట్టాలు కొట్టుకుపోతున్నై. దాంతో సమీప కాలంలో రైళ్ళు నడిపే అవకాశంలేదని రైల్వే మంత్రి నిస్సహాయతని తెలిపారు. ప్రజలకు ఆహారం వైద్యం అందించే కార్యక్రమాలు సజావుగా జరగడానికి కారణం కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనలేనని రవాణా మంత్రి చేతులెత్తేశారు. పల్లెటూళ్ళు, ఓ మాదిరి పట్నాల సంగతి పక్కనబెడితే, విద్యుత్ సరఫరా ఘోరంగా దెబ్బతిని, నగరాలు చీకట్లో మగ్గుతున్నాయి. పరిస్థితి ఎప్పటికి బాగుపడుతుందో చెప్పలేమని. వాయుదళ విమానలో పర్యటించి, ఆయా రాష్ట్రాల పరిస్థితిని సమీకరించిన ప్రధానమంత్రి అన్నారు. ఆర్మీ, నేవీ, ఏర్‌ఫోర్స్ దళాలను ప్రకృతి వైపరీత్యానికి గురైన ప్రాంతాల్లో దించి సహాయక చర్యల్ని ముమ్మరం చేస్తామని కూడా ప్రధానమంత్రి తెలియజేశారు"

రేడియో వార్తల్ని వింటున్నారు జయ్, దద్లానీ, గోర్కీ బృందం. రాత్రికి రాత్రి జరిగిన కల్లోలం అందర్నీ మౌన సాక్షుల్ని చేసింది.

"గాడ్.. యీ సమయంలో మనం ఎవరినీ కలిసే ఛాన్స్ లేదు. అంతేకాదు .ట్రైన్స్, ఫ్లైట్స్ మళ్ళీ మొదలయ్యేవరకూ ఇక్కడినించి కదిలే పరిస్థితి కూడా లేదు" అన్నాడు శమంతో భట్టాచార్య.

"యస్.. మనకి మరో మార్గంలేదు" అన్నాడు స్టిట్సన్.

"ఈ ప్రళయానికి కూడా ఏదైనా కారణం వుంటుందా? లేకపోతే రాజస్థాన్ ఎడారుల్లో వరదలేమిటీ? అనూప్ గ ఢ్ రాయసింగ్ నగర్ ఇవన్నీ నాకు పరిచయమైన నగరాలే. అసలవి ముంపుకి గురవుతాయని ఎవరి ఊహలోకీ రానేరాదు. అలాంటిది ఇదేమి చోద్యం. ముఖ్యంగా సౌత్, మధ్య భారతం. ఈ అకాల వర్షాల వెనకాల కూడా ఏమైనా కుట్రలు కుతంత్రాలు ఉన్నాయా? సిల్వర్ అయొడైడ్ ప్రయోగించి కృత్రిమ వర్షాలు కురిపించడం మనకి తెలిసినదే. అటువంటి ప్రయత్నం జరగాలంటే చాలా ప్రిపరేషన్ కావాలి. క్లౌడ్ సీడింగ్ అంత సులభమైన ప్రక్రియకాదు" ఆగాడు రిషి యాదవ్. ద సిటీ అబ్జర్వర్ హర్యానా ప్రతినిథి.

"నేనూ ఆ ప్రాంతాలకి అనేకసార్లు వెళ్ళాను. వరదలు వస్తాయని కలలో కూడా ఊహించలేం" అన్నాడు నరోత్తం ఝా అతను సిటీ అబ్జర్వర్ యు.పి ప్రతినిధి.

మొహమ్మద్ అతీం గొంతు సవరించుకుని, "ఢిల్లీకి అకాల వర్షాలు కొత్తకాదు. కానీ, ఇంత భారీ వర్షాన్ని ఢిల్లీ గత వందేళ్ళుగా చూసి వుండకపోవచ్చని ఘంటాపథంగా చెప్పగలను" అన్నాడు.

"సారీ జంటిల్‌మెన్. మనం భారత్‌లోని సంఘటనలనే తలుచుకుని బెంబేలెత్తుతున్నాం. ఇతరదేశాల్లో ఏం జరుగుతోందో ప్రస్తుతం మనకి సమాచారంలేదు. అది బహుశా ఇంకా ఘోరంగా ఉండొచ్చు" చిన్న గొంతుకతో అన్నాడు రజోవ్ స్కి. రుడోవ్ స్కీ రాష్యన్.

డాంటే మాత్రం సైలెంటుగా ఉన్నాడు.

"మీ ఒపీనియన్ ఏమిటీ?" అడిగాడు జయ్.

"ఐ కాంట్ సీ మిస్టర్ జై.. నిన్న రాత్రి మహాభారత యుద్ధం గురించీ ,ఆ యుద్ధానికి ముందు వచ్చిన ప్రళయాల గురించీ, శకునాలు స్వప్నాల గురించీ గోర్కీ చెప్పాడు. బహుశా ప్రపంచపు ప్రళయానికి ఈ సంఘటన ఓ సూచన ఏమో! సూచనే ఇంత ఉగ్రంగా ఉంటే, అసలు సిసలు ప్రళయం వచ్చినప్పుడూ? నిన్న గోర్కీ మాటల్లో నాకు మాటలుగాక సంకేతాలు వినిపించాయి. బహుశా మన ఫ్యూచర్‌ని మనమే మన మాటల్లో తెలుపు కుంటామేమో. ఆ గమనిక ఆ సమయంలో ఉండకపోవచ్చు" అన్నాడు. ఎడ్వర్ట్ డాంటే. అందరూ సైలెంటైపోయారు.

ఉజ్జయని వీధులు నిర్మానుష్యంగా ఉన్నాయి. రాకపోకలు తెగిపోవడంతో యాత్రికులు కరువై నగర వీధులు బోసి పోతున్నాయి. క్షిప్రానది గత 200 సంవత్సరాలలో పొంగనంత ఉధృతంగా పొంగి పొలాల్నీ, గట్లనీ, గ్రామాల్నీ ముంచేసింది. మహా మాయాదేవీ, మహా కన్యాదేవీ, హనుమంతు గంటల తరబడి మహా కాళేశ్వరాలయంలోనే గడుపుతున్నారు. అక్కడి పూజారులు వారికి భోజనాన్ని సమకూర్చుతున్నారు. ఆలయ భాండాగారంలో ఆహార పదార్థాలు నిండుగా ఉండటంతో, రోజు గడవని సామాన్య ప్రజలు కూడా అక్కడే, అంటే ఆలయం దగ్గరే ఆలయ సిబ్బంది ప్రేమగా పంచుతున్న ఆహార పదార్థాలని తాము తింటూ, తమ వారికి తీసుకెడుతూ నిశ్చింతగా ఉన్నారు. ఉజ్జయిని మాత్రం అకాల వర్షాలకి ఏమాత్రం చెక్కుచెదరలేదు. వర్షాన్నంతట్నీ జహ్నూ మహర్షి గంగని మింగినట్టు క్షిప్రానది మింగేసింది.

గంగ ఎంత ప్రవహించినా శివుని జటాజూటాన్ని ఏమీ చేయలేదుగదా! ధన ప్రాణ నష్టాలు లేకపోవడం కాళేశ్వరుని మహిమే అని సామాన్య ప్రజలేకాదు, నగరవాసులందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వార్తలు ఎప్పటికప్పుడు నగరవాసులకు తెలుస్తూనే ఉన్నాయి.

"అమ్మా చిత్రంగా లేదూ. రాష్ట్రాలకి రాష్ట్రాలు మునిగిపోయి హాహాకారాలు పెడుతున్నా మనం మాత్రం అమ్మవారి ఒడిలో ప్రశాంతంగా ఉండటం" అన్నాడు హనుమంతు.

"నాయినా.. అమ్మవారు ఉన్నారు గనకనే నిశ్చంతగా ఉన్నాం. ఇదెందుకు వచ్చిందో కాలమే నిర్ణయించాలి. ప్రకృతి ఎప్పుడూ ఒక పెద్ద ముల్లుని చిన్న ముల్లుతో తీసే ప్రయత్నమే చేస్తుందిగానీ తనని తాను శిక్షించుకోదు, నష్టపరచుకోదు" అన్నది మహామాయి.

"మరి ఇంత మనుషులూ, పశువులూ చనిపోయాయే. వారు, అవి ఏం తప్పు చేశారనీ?" అడిగాడు ఓ బాల వటువు.

"మృత్యువంటే ఏమిటీ?" నవ్వి అడిగింది మహామాయ.

"పుట్టుక ఎలాంటిదో చావూ అలాంటిదే. ప్రతి జీవీ పుడుతుంది. ప్రతి జీవీ మరణిస్తుంది. కొన్ని జీవులు కొన్ని క్షణాలు మాత్రమే బ్రతికితే కొన్ని జీవులు కొన్ని రోజులు, నెలలు, సంవత్సరాలబాటు బ్రతుకుతాయి. కొన్ని ఓ దశాబ్దానికి అంటే, పది సంవత్సరాలలోపే చనిపోతే మనుషులు ఆరునించి తొమ్మిది దశాబ్దాలదాకా వారి వారి ఆరోగ్యాన్ని బట్టి బ్రతుకుతారు. ఇంకా ఆరోగ్యవంతులు  వందా నూట ఇరవైదాటి కూడా బ్రతుకుతారు." ఓ క్షణం ఆగింది మహామాయి. అందరూ శ్రద్ధగా వింటున్నారు.  హనుమంతుకి హిందీ బాగా అర్థం అవుతోంది. సంస్కృతమూ అర్ధమవుతోంది, మాట్లాడలేకపోయినా.

"నాయనా కాలం అనేది ఓ ప్రవాహం. జీవులన్నీ అందులో పుట్టిన బుడగలు. అవి కాలంలోనే పుట్టి, కాలంలోనే పెరిగి కాలంలోనే అంతమవుతాయి. జనన మరణాలు అనేది ఒక 'స్థితి'ని సూచించేవేకానీ, శాశ్వతంకాదు" మరింత వివరించింది మహామాయి.

"అమ్మా మా తాతముత్తాతలు హుంజావేలీకి చెందినవారు. అక్కడ మనుషులు దాదాపు 120 ఏళ్ళకి పైనే బ్రతుకుతారట. మా అందరికంటే పెద్దవాడు హుంజామీర్. ఆయన భార్య హుస్నా మీర్. వారు ఇంకా జీవించేవున్నారు. హూంజా మీర్ గారి వయస్సు 130 దాటిందని మాతాత చెబితే విన్నాను" అన్నాడో స్ఫురద్రూపి. మహాకన్యాదేవీ మహామాయి అందరూ ఆ దిక్కుకేసి చూశారు. ఆరడుగుల రెండంగుళాల ఎత్తు. బలిష్టమైన చేతులు భుజాలు, ముట్టుకుంటే మాసిపోయే రంగుతో మెరిసిపోతున్నాడతను.

"మీరు హూంజా మీర్ గారిని చూడలేదా?" మహా కన్యాదేవి అడిగింది... అతనివంకే చూస్తూ.

"ఊహూ.. ఆ ముల్క్ వేరుగా వుంది. అక్కడికి వెళ్ళాలంటే చాలా తంతంగం వుందిట. మా తాత, బామ్మ. అమ్మా నాన్న అందరూ ఈ దేశంలోనే పెరిగారు. మరి పెదనాన్నలూ, బాబాయిలు కూడా ఇక్కడే పుట్టి పెరిగారు. అందుగురించే, మా స్వస్థలం గురించి వినడమే గానీ చూసింది లేదు. అదో భూలోక స్వర్గం అంటారు మా తాత!" చెప్పాడతను చిరునవ్వుతో.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments